# సంపాదన

కథ :
ఎన్. పి. విశ్వనాథశర్మ

అది ప్రశాంతమైన సాయంకాలము. సూర్యుడు అప్పుడే అస్తమించబోతున్నాడు. ఆసాయంకాలపు ఎండలో బీచ్‌లోని ఇసుక రేణువులు తళతళ మెరుస్తున్నాయి. ఉదయం మొదలు సాయంకాలమువరకు అనుభవించిన కష్టాలను కాస్సేపు మరచిపోదామని పట్టణవాసులంతా అప్పుడే బీచ్‌కి చేరుకుంటున్నారు. వారిలో శేఖర్ ఒకడు. అతడొక్కడూ విడిగా ఒకచోటకూర్చుని ఏదో ఆలోచిస్తూన్నాడు.

అంతలో హఠాత్తుగా "అబ్బా" అను ఒక ఆర్తనాదము విన్నాడు. అతడు స్మృతిలోనికి వచ్చాడు. వెనుదిరిగి అక్కడ ఒక యౌవనవతియగు స్త్రీ తన ఎడమకాలును రెండు చేతులతోపట్టుకొని క్రిందపడియున్నట్లుచూచాడు. ఒకనిమిషము ఆమెసౌందర్యమునుచూచి స్తంభించిపోయాడు. ఆమెనెలా సంబోధించాలా అని ఆలోచన. ఆమె తన సహాయ మపేక్షిస్తోందా అనుకున్నాడు. ఆమె నెమ్మదిగా లేచుటకు ప్రయత్నిస్తోంది. నెమ్మదిగా ఆమెను సమీపించాడు.

"నావల్ల ఏదైనా సహాయము కావాలిస్తే చేస్తాను" అన్నాడు గొంతుసవరించుకుంటూ—ఆమె అతనివంకచూచింది. ఆమె కళ్లెంత అందంగావున్నాయి. కాని యిది ఆమెను పొగడటానికి సమయము కాదనుకున్నాడు. "మీరు ఇష్టపడితే మీకు సహాయముచేయుట నాకు చాలసంతోషము"

"మీదయకు చాలకృతజ్ఞురాలను. మిమ్మల్ని ఎలాఅభినందించాలో తెలియుటలేదు. ఈ బూట్‌ను నేను అసలుతొడగను. కాని ఈ రోజున తొడగకతప్పిందికాదు. అందువల్ల పడ్డాను. అసలు కాలువిరిగిందేమోనని భయంగావుంది. మీరు శ్రమఅనుకోకపోతే ఒక రిక్షాపిలిస్తే యింటికివెడతాను" అంది ఆమె కృతజ్ఞతాపూర్వకముగా—" ఎంత మాటన్నారు. ఇందులో అంత శ్రమపడవలశినదేదీ కన్పించుటలేదే. అయినా (డిస్ట్రెస్)లో ఉన్నపుడు ఒకరికొకరు సహాయముచేయుట ప్రకృతిసహజమే కదండీ " అన్నాడు తననామె బొత్తిగా ఇంగ్లీషు రానివానిలాగ చూస్తుందేమో నని."

"త్వరగా పిలుచుకురండి." "మీరిక్కడే కూర్చునివుండండి. నేనిప్పుడే వస్తాను" అన్నాడు.

శ్రావ్యమైన ఆమెకంఠధ్వని ఇంకా అతని చెవులలో ప్రతిధ్వనిస్తోంది. వెళ్లి ఒక రిక్షా తీసుకువచ్చాడు. ఆమె అందులోకి ఎక్క

డానికి తగినస్థితిలో లేకపోవుటవల్ల నెమ్మ
దిగా తనేయెత్తి ఆమెను రిక్షాలో కూర్చో
పెట్టాడు. ఆహా! ఆమెశరీరము ఎప్పుడూ తన
నెడబాయకుండా అలా తాకుతూవుంటే
బాగుండుననుకున్నాడు. రిక్షాను చైనాబజారు
రోడ్డుకుపోనిమ్మంది ఆమె. "మీరుకూడా
నాతోవస్తారా" అంటూ "లేదు, మాది
బ్రాడ్వే" ఇది అతనిజవాబు. కాని వెంటనే
నొచ్చుకున్నాడు. తనుకూడా ఆమెననుస
రిస్తే ఎంతబాగుండేది. కనుచూపు మేరలో
నున్నంతవరకు రిక్షానుచూస్తూ యింటి
ముఖముపట్టాడు.


**Encourage Home Industries**

Buy Fancy Mysore Sandle-
wood buttons, caskets,
Channapatna Toys and
Penholders at their best

*With :—*

***Singiri Viswanatha
Setty & Bros,***

Wholesale Toys Merchants,

Avenue Road,

Bangalore City.

KATAKA


మరుసటిదినము ఉదయము దుస్తులు
వేసుకుని చైనాబజారురోడ్డుకు బయల్దేరాడు.
ఇంతలోతనకోసము ఎవరోవచ్చినట్లుకబురు.
లోనికిరావచ్చన్నాడు. ఆ వచ్చినదెవరు?
ఆమె నిన్న బీచ్‌లోని స్త్రీయే! కాని ఆమె
లో ఎంతమార్పువుంది. ఆమె చాలాకోపంగా
వుంది.

"ఆలా కూర్చోండి" అన్నాడు అర్ధ
రాత్రివేళ తనను కామించివచ్చిన తారను
కూర్చోమన్న చంద్రుడిపోజుతో "క్షమిం
చండి! నేను యిచ్చటకు మీ మర్యాదల
కోసమురాలేదు. మీరుచేశిన ఘనకార్య
మునుగూర్చి మిమ్మల్ని మందలించాలని
వచ్చాను" అంది ఆమె కొంచెంసీరియస్‌గా.
వెంటనే అతనిమీదకు ఒకన్యూస్ పేపరు విసి
రింది. పేపరువిప్పాడు. అందులో తాను నిన్న
ఆమెవక్షస్థలాన్ని అదుముకొని ఎత్తిరిక్షాలో
కూర్చోపెట్టినప్పటి Snap shot ప్రచురింప
బడియుండడము చూచాడు. తను యెంత
అదృష్టవంతుణ్ణో అనుకున్నాడు. దానిక్రిం
దుగా "అందమైన snap shots తీయాలంటే
మీ కెమేరాలు, ఫిల్ములుకూడ "రవి అండ్
కో" చైనాబజారురోడ్డు, మద్రాసు "వారి
వద్దనుంచే కొనండి" అని పెద్దక్షరాలలో
ఒక ప్రకటనచూచాడు. అతనికి నవ్వు
వచ్చింది. ఆమెకోపమెక్కువైంది. "ఇలా
ఈ ఫోటో ప్రచురింపబడుటవల్ల నా గౌరవ
మంతాపోతోంది. హాస్టలులోని నా

స్నేహితులముఖముచూడ లేకుండావున్నాను. నా తల్లిదండ్రులు నాకింక చదువు చెప్పిస్తారా' అంది ఆమె విషణ్ణహృదయంతో. ఆమెను చూచి శేఖర్ చాలజాలిపడ్డాడు. ఆఫోటో ప్రచురించినవానిమీద ఆతనికి చాలాకోపం వచ్చింది. వెంటనే "ఈఫోటో మిగిలిన పత్రికలలోనైనా ప్రచురింపబడకుండా చెయ్యాలి. మనము ఇపుడు ఆచోటుకు వెళ్దామా" అన్నాడతను. ఇద్దరూకలశి ఆ షాపుకువెళ్లారు. "లోపలకు దయచేయండి" అని ఆహ్వానించాడా షాపు ప్రొప్రయిటరు. "క్షమించండి. ఇచ్చట మేమేమీకొనుటకు రాలేదు. మీరు మా యీ ఫోటోను ఎందుకు ప్రచురించారో విచారించుటకు వచ్చాము. ఇందులో మీ వుద్దేశము మాకు అర్థమవడములేదు" అంది ఆమె కొంచం కోపంగా. ఆమెకు సమాధానమీయకుండా శేఖర్ వంకతిరిగి "క్షమించండి. అది మీ ఫోటోఅని నాకేం తెలుసు. ఎవరో ఒకాయన వచ్చి ఈఫోటో నాకుచూపించాడు. ఆకర్షణీయంగానున్నదికదా అనే వుద్దేశ్యముతో దీన్ని రు 25/-యిచ్చి కొన్నాను. నా ఎడ్వర్టైజ్‌మెంట్‌లో వేయించుకున్నాను. ఇంతవరకే నాకీ ఫోటోవిషయము తెలుసు" అని ఓ చిన్నవుపన్యాస మిచ్చాడా బట్టతల ప్రొప్రయిటరుగారు ఫోటోనుగురించి. ఆమె నోటంట మాటలేదు. అప్పుడు శేఖర్ "మీరీఫోటోను మిగిలిన పత్రికలకైనా పంప


## చక్కని జుయెల్ రిస్టు వాచీలు



సరియైన గంట చూపుతుంది. గట్టి యంత్రనిర్మాణం. నూరు సంవత్సరములు గ్యారంటీ. క్రోమియంకేసుస్టువాచీ రు. 20 బంగారుకేసు రు. 25. మేలురకం గోల్డు ప్లేటెడ్ రు. 27. లేడీసైజు రు. 28. అత్యుత్తమము రు. 40. స్పెషల్ రు. 45. పోస్టేజీ రు. 0-14-0. రెండు ఒక్కసారి కొనిన తపాలు ఖర్చులు ఉచితము.

(ఆర్డర్లు ఇంగ్లీషులో వ్రాయండి.)

## హోమ్ ప్రింటింగ్ పాకెట్ ప్రెస్




పేరు, విలాసములు, లేబుల్సు, ఉత్తరాలు, లెటర్సు, ప్రోగ్రామ్ మొదలైనవి యింటివద్దనే సులభముగా ప్రింటు చేసుకో వచ్చును. ప్రతియింట వుండదగినది. వెల నెం. 2 రు. 1-8-0, నెం. 3 రు. 2-8-0. స్పెషల్ రు. 4-0-0.

పోస్టేజీ పాకింగ్ రు. 0-14-0.

(ఆర్డర్లు ఇంగ్లీషులో వ్రాయండి.)

**CALCUTTA WATCH CO.,**
**(Sec. 527)**

P. O. Box No. 12203,

**Calcutta.**

కుండావుండాలి. ఇప్పటికే మీరు మాయిర్వురకూకూడా తీరని అపకారంచేశారు'' అన్నాడు. ''మరి నా రు25/-లు విషయము. అకారణముగానే నాడబ్బును ఒదులుకోవలశినదేనా'' అన్నాడు కోశ్చన్‌మార్కు ముఖంతో ప్రొప్రయిటరు. ''పోనీ ఆ రు25/- మీకు నేనిస్తాను తీసుకోండి అంది ఆమె. కాని ఆతనిలో ఆసూచనలేమీ కన్పించలా. ''నేను కొన్నఖరీదుకు తిరిగి మీకీఫోటో అమ్మమంటున్నారా? మీరే నాస్థితిలోవున్నారనుకోండి. అప్పుడు మీరిలాచేస్తారా'' అన్నాడా ప్రొప్రయిటరు దీనంగా.

అలాఅనటములో ఆయన ఉద్దేశాన్ని గ్రహించిన శేఖర్ పర్సులోనుంచి ఒక రు 50/- నోటును ఆయనకందించాడు. 'ఈ విషయాన్ని మరచిపోండి' అంటూ వారిద్దరూ బయటకువచ్చేసారు. కొంతదూరం సాగినతరువాత ''నేను వెళ్లివస్తాను. మిమ్ములను చాలశ్రమపెట్టాను'' అని శెలవుతీసుకుందామె.

* * *

శేఖర్ యింటికివచ్చేసరికి అతనికొరకు అతనిస్నేహితుడు రామువచ్చి కూర్చునివున్నాడు. అతనిచేతిలోకూడ ఇదేపేపరు వుంది. శేఖర్‌ను చూడగానే 'యేరాబ్రదర్! యింత తెలివిగలవాడివని, ఇంతచదువూ చదివి పడకపడక దీనివలలోపడ్డావేమిట్రా దీనిప్రక్కన నిన్నచూడడానికి నాకే సిగ్గేస్తోంది' అన్నాడతను చలోక్తిగా. శేఖరుకు యిదేమీ అర్థముకాలేదు. ''ఈమెలో లోపమేమిట్రా. ఇంతసౌందర్యవతి వెయ్యిజన్మాలు నువ్వు తలక్రిందులుగా తపసుచేస్తే మాత్రము దొరుకుతుందిరా'' అన్నాడు సగర్వంగా శేఖర్. తరువాత ఆమెతోతనకు పరిచయమెలాకలిగిందీ, తను ఆ ఫోటో స్టోర్సువానికి రు 50/-యిచ్చిన విషయము అంతాచెప్పాడు. అప్పుడు రాము నవ్వుతూ ''నువ్వు రు 50/-యిచ్చిన రవిగాడికూతురేరా యిది. దీనికి ప్రతిదినమూ యిదేపని. ఇలాగే సంపాయిస్తున్నాడురా వాడు. నీబోటి క్రొత్తగా మద్రాసువచ్చినవాళ్లనందరనూ అది ఇలాగేచేస్తుంది'' అన్నాడు.

శేఖర్ నిర్ఘాంతపోయాడు.

---

ఫలహారం

భర్త—'ఒసేయ్, కాఫీఫలహారం రెడీ అయిందా?'

భార్య—'ఇంకా లేదండి.'

భర్త—'అయితే నేను చంద్రభవన్ కాఫీహోటలుకు వెళ్ళనా?'

భార్య—'ఓ అయిదునిమిషాలు ఓపికపూనండి.'

భర్త—'అంతలో సిద్ధమౌతుందా?'

భార్య—'కాదు, డ్రస్‌చేసుకొని నేనుకూడా మీతోవస్తాను.'